క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అవగాహన



మంగళగిరి: అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాద నివారణ వారోత్సవాలలో భాగంగా శనివారం మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరక్కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఆయా సంస్థలలో అగ్నిమాపక యంత్రాలు, ఇసుకబస్తాలు, నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పవళింపు సేవ ఉత్సవం



మంగళగిరి: నగర పరిధిలోని ఆంజనేయ కాలనీలో శనివారం సీతారాముల పవళింపు సేవ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించి 16 రోజులు అయిన సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి సీతారాముల పవళింపు సేవ ఉత్సవం నిర్వహించారు. పవళింపు సేవకు అధిక సంఖ్యలో భక్తులు, దాతలు హాజరు కాగా అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీ సీతారామ భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వేమవరంలో గ్రామసభ



ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలో శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి మున్నంగి శివకుమారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి జీవీఆర్‌కే మూర్తి మాట్లాడుతూ 2023–2024కు సంబంధించి బడ్జెట్‌లోని అంశాలు చదివి వినిపించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పంచాయతీ తీర్మానాలు గురించి మాట్లాడారు. వేసవి కాలం కావడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు.

ఇంట్సో ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి: నగర పరిధిలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఇంట్సో)లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ కె.వాసు శనివారం తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీజీఎం మురళీ కృష్ణ, ఆర్ఐ రామారావు, డీన్ జి.కాళిదాసు, ఇన్‌చార్జి డి.నాగలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని 2023–2024 సంవత్సరం వివిధ రకాల పన్నులు ముందస్తుగా చెల్లించిన వారికి రాయితీని అందజేస్తున్నట్లు ఆర్ఐ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి పన్నులు ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులు చెల్లించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పీహెచ్‌సీలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ఆప్తాలమిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఉచిత వైద్య శిబిరంలో 63 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 12 మందికి కళ్లజోళ్ల అవసరం అని గురించి ఉచితంగా కళ్లజోళ్లను అందించామని, 4గురికి కంటి ఆపరేషన్ అవసరం ఉండడంతో తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశామని అన్నారు. అనంతరం కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే ఆర్కే
- అర్బన్ హెల్త్ సెంటర్‌కు అవసరమైన పరికరాలు అందజేత



హెల్త్ సెంటర్ డాక్టర్ కె.అనూషకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు సమక్షంలో పరికరాలు అందజేస్తున్న తాడేపల్లి రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి: వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు అవసరమైన పరికరాలను తాడేపల్లి రోటరీ క్లబ్ అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. శనివారం నగర పరిధిలోని గణపతినగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అందజేసిన రూ.1.50 లక్షల విలువైన ప్రొజెక్టర్, ఏసీ, వాటర్ ప్యూరిఫైర్ ను ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలో ప్రతి ఇంటి వద్దకే వైద్యం అందించేలా ప్రతి 30 వేల మందికి ఒక వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నగరంతో నిర్మాణం చేసిన తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అందుబాటులోకి రాగా ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ.83లక్షలతో పాటు నగర పాలక సంస్థ నుంచి ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.80 నుంచి కోటి రూపాయల వరకు అదనంగా కేటాయించి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గణపతి నగర్‌లోని హెల్త్ సెంటర్ నేషనల్ హెల్త్ అస్యూరెన్స్ క్వాలిటీకి ఎంపికయిన నేపథ్యంలో త్వరలోనే కేంద్ర బృందం రానుందని చెప్పారు. హెల్త్ సెంటర్‌కు అవసరమైన ఏసీ, వాటర్ ప్యూరిఫైర్, ప్రొజెక్టర్‌లను తాడేపల్లి రోటరీ క్లబ్ నిర్వాహకులు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఆయా అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన పరికరాలు, వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని కోరారు. పది పడకల ఆస్పత్రిగా వైద్యసేవలు అందిస్తున్న హెల్త్ సెంటర్‌లు ప్రారంభించిన కొద్ది రోజులలో రోజుకు 100కు పైగా రోగులు వైద్య సేవలందుకుంటున్నారంటే హెల్త్ సెంటర్‌లలో ప్రజలకు అందుతున్నాయంటే ప్రజలకు హెల్త్ సెంటర్‌లు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో అర్థమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కె.అనూష, తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి రామకృష్ణశెట్టి, ప్రతినిధులు కిరణ్, అమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రావూరి రమేష్, రవీంద్ర, రమేష్, సుకుమార్ రెడ్డి, చంద్రా ఓబులరెడ్డి, కేశవరావు, శ్రీనివాసరావు పార్టీ నాయకులు బొమ్ము శివరామిరెడ్డి, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

శ్రీరామానగర్ కాలనీలో అభివృద్ధి పనులు...

నగరంలోని ఆరో ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్డు శ్రీరామానగర్ కాలనీలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. శనివారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి డ్రెయిన్ నిర్మాణ పనులు, రహదారి విస్తరణ పనులు పరిశీలించారు. నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ రహదారి మార్గానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్గంగా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. వీరి వెంట డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేను కలసిన యర్రబాలెం అసైన్డ్ బాధితులు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్ అసైన్డ్ బాధితులు శనివారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను కలిశారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆర్కేను, తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్‌ను అసైన్డ్ పేదలు కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గత కొన్నేళ్లుగా యర్రబాలెం బసవతారక నగర్ సర్వే నెంబరు 774లోని భూముల్లో నివాసాలు నిర్మించుకుని జీవిస్తున్నామని, ఈ నేపథ్యంలో గత 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను నిషేధిత భూములు(22ఎ) జాబితాలో చేర్చిన కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆర్కే హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గాన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు, వడ్డేశ్వరం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాతూరులో వైఎస్సార్ సీపీ కన్వీనర్ ప్రాతూరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచి ప్రాతూరు మేరిరాణి, ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు మరియబాబు, రైతు సంఘం నాయకులు వజ్రాల నాగిరెడ్డి, రెడ్డిబత్తుల ఈశ్వరరెడ్డి, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరంలో పార్టీ కన్వీనర్ గొడవర్తి శ్రీను, బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), అన్నపురెడ్డి రాము, కళాచందు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థినికి కళ్లజోడు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

విద్యార్థులే దేశానికి భవిష్యత్

తాడేపల్లి రూరల్: విద్యార్థులే ఈ దేశానికి భవిష్యత్ అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కృష్ణవేణి ఎగ్జిబిషన్ సొసైటీ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో జువారి సిమెంట్ వారి సౌజన్యంతో విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ గత నెల 7వ తేదీన కృష్ణవేణి ఎగ్జిబిషన్ మహిళా కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి కళ్లజోడు అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించామని అన్నారు. కార్యక్రమంలో జువారి సిమెంట్ గుంటూరు జిల్లా మార్కెటింగ్ మేనేజర్ జి.మురళీకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకృష్ణ, పరుచూరి కిరణ్, చంద్ర ఓబులా రెడ్డి, సుకుమార్ రెడ్డి, ఎ.రవీంద్రరెడ్డి, ఎ.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, శెట్టి కేశవ రావు, రావూరి రమేష్ బాబు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి



ప్రసంగిస్తున్న సీపీఎం నాయకుడు ఈమని అప్పారావు

తాడేపల్లి రూరల్: ప్రజా వ్యతిరేక, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం– దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం రాజకీయ ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు, శృంగారపురం, గొడవర్రు, పెరికలపూడి, ఈమని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతు ఎత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయం వచ్చిందని అన్నారు. మోదీ అండదండలతో అదానీ ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిడెన్ బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికు హక్కులను కాలరాస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే రాజకీయ ఆందోళనలో భాగంగా ఏప్రిల్ 24న మంగళగిరి పట్టణంలో జరిగే బహిరంగ సభలో సీపీఎం, సీపీఐ జాతీయ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మంగళగిరి నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య, పార్టీ దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వి.సాంబశివరావు, వై.బ్రహ్మేశ్వరరావు, ఏసుపాదం, సీపీఐ దుగ్గిరాల మండల నాయకులు షేక్ కరీముల్లా, బాబ్జి పాల్గొన్నారు.

తాడికొండ: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మతోన్మాద దాడులు పెరిగాయని వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తాడికొండలో శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచార భేరిని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి రావి చెట్టు కూడలి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకులు గుర్రం కొండ సత్యానందం, కనగాల పూర్ణచంద్రరావు, టి.వెంకటేశ్వర్లు, తాడిబోయిన శ్రీనివాసరావు, వై.నరసింహారావు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వేసవిలో వ్యాక్సిన్ వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరిధర్ సూచించారు. మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లోని వ్యాక్సిన్ సెంటర్లను శనివారం పరిశీలించారు. ఏఈఎఫ్ఐ కిట్లులో మందులు ఉన్న వాటి వివరాలు, డ్యూటీ లిస్టులను తనిఖీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మంగళగిరి: వేసవిలో ఎండలు మండుతున్న నేపథ్యంలో జాతీయ రహదారి వెంట ప్రయాణించే వారి దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్పీ డీఐజీ సిహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఏపీఎస్పీ బెటాలియన్ ప్రధాన ద్వారం జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. డీఐజీ మాట్లాడుతూ జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారులు, కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు వలన ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉంటారని చెప్పారు. వేసవిలో ఎండలు మండుతున్న నేపథ్యంలో దాతుల వీలైనంత వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీఐజీ వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండలంలోని బేతపూడిలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఖాసిం షాహిద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ ఖాజావలి, సలీం పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు శ్రీనివాసులు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల నుంచి మట్టి పరీక్షలు చేయనుందని దాని కొరకు రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. మట్టి పరీక్షలు చేయడం ద్వారా రైతులకు తమ పొలంలో ఎంత ఎరువు వేయాలో భూమి ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో తెలుస్తుందని వివరించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడడం వల్ల నేసారం మరియు ఆరోగ్యం వృద్ధి చెందుతుందని సెంచురియన్ విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ విద్యార్థిని కె.కీర్తన రాజన్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇస్తున్న మండల వ్యవసాయ అధికారి

అగ్ని ప్రమాదంలో పైపులు దహనం

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు రైల్వేగేటు సమీపంలో పైపులు దహనం చేసిన ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాలు.. నిడమర్రు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ప్లాస్టిక్‌పైపులు వేసి ఉండగా శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గుర్తు తెలియని ఆకతాయిలు ప్లాస్టిక్ పైపుల దహనానికి పాల్పడినట్లు భావిస్తున్నట్లు తెలిపారు.

విశ్రాంత ఉన్నతాధికారి మనోహర్ మృతి



మనోహర్ (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ విశ్రాంత సీఈఓ వీడీఆర్ మనోహర్ (83)వయో భారంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ మేనేజరుగా, కర్నూలు జిల్లా పరిషత్ సహాయ సీఈఓగా చేసిన మనోహర్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓగా పదవీ విరమణ చేశారు. తెనాలిలోని ఉడా కాలనీలో విశ్రాంత జీవనం గడుపుతూ వాకర్స్ క్లబ్ తెనాలి–2ను మిత్రులతో కలిసి ప్రారంభించారు. ప్రతి నెలా వైద్యులతో ఆరోగ్య సలహాలను ఇప్పిస్తూ, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఏటా తన సొంత రూ.50 వేలతో కేఎస్ఎం హైస్కూలు, ఎస్‌సీఆర్ఎం హైస్కూలు విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పుస్తకాలు, ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందజేస్తూ వచ్చారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ తెలిపారు.
వీరి కుమారుడు వీరమాసునేని శ్రీనివాస్ అమెరికాలోని యునైటెడ్ స్టేట్స్ జిప్సమ్ కార్పొరేషన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా చేస్తున్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి–2 సభ్యులు ఆనందరావు, భుజంగరావు, బుచ్చిబాబు, భాస్కరరావు, సూరిబాబు తదితరులు మనోహర్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మట్టి నమూనా సేకరణపై శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం పలు గ్రామాల వ్యవసాయ సహాయ సంచాలకులకు మట్టి నమూనా సేకరణ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహాయ సంచాలకులకు పవర్ పాయింట్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మట్టి నమూనాలు ఎలా తీయాలో వివరించారు. అనంతరం రేపూడి గ్రామంలోని రైతు పొలంలో మట్టినమూనాలు తీసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ రమణకుమార్, వ్యవసాయ విస్తరణాధికారి షేక్ సుభాని పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతుకు మేలు

పెదపరిమి(తాడికొండ): భూసార పరీక్షలతో వ్యవసాయంలో అధిక ఖర్చులను తగ్గించుకొని వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు వినియోగించి పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని తుళ్లూరు మండల ఏఓ శ్రీరంజని సూచించారు. శనివారం తుళ్లూరు మండలం పెదపరిమిలో భూసార పరీక్షలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మట్టి నమూనాలను సేకరించే పద్ధతిపై అవగాహన కల్పించారు.

దాడిచేసిన వారిపై కేసు

కొల్లూరు: వివాదాన్ని సర్దుమణిచేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడిచేసి, గాయపర్చిన వ్యక్తులపై శనివారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సుగ్గునలంకకు చెందిన సుగ్గున అశోక్, సుగ్గున సాంబశివరావులకు వరిగడ్డి రవాణ చేస్తున్న ట్రాక్టర్లకు చెందిన వ్యక్తులతో గురువారం అర్ధరాత్రి వివాదం జరిగింది. అదే సమయంలో సుగ్గునలంకకే చెందిన దూళిపూడి శ్రీనివాసరావు ఇరు వర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తుండగా.. అశోక్, సాంబశివరావు కర్రలతో దాడి చేశారు. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

మహిళసాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం



నుదురుపాడులో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా తదితరులు



మంగళగిరిలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న నిమ్మకాయల రాజనారాయణ తదితరులు



వేములూరిపాడులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



ఫిరంగిపురంలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను అందజేస్తున్న ఎంపీపీ షహేలా నర్గీస్

ఫిరంగిపురం: మహిళసాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండలంలోని నుదురుపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బొడ్డురాయి సెంటర్లో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా గడప గడపకు తిరిగి ప్రభుత్వం నుంచి వారికి లభించిన పథకాల లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగన్ కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి జి.నాగమల్లేశ్వరి, అప్పిరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, పుల్లారావు, చౌదయ్య, అయ్యప్ప పాల్గొన్నారు.

వేములూరిపాడులో..

గ్రామంలోని ఎస్సీకాలనీలో సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. తాడికొండ వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కె.ఆనంద్, పి.మరియబాబు, ఎంపీటీసీ సభ్యులు ఎ.అనూరాధ, ఐజాక్, చంద్రశేఖరరెడ్డి, కమలారెడ్డి, పి.వెంకట్రావు, బి.నాగరాజు, అమానుల్లా, బాజీ. మీరా పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాదీపం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండలంలోని బేతపూడిలో శనివారం జగనన్న మన భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు తెలియజేసి జగనన్నే మన భవిష్యత్ స్టిక్కర్‌ను అందజేశారు. కార్యక్రమంలో షేక్ సలీం, షేక్ ఖాసిం షాహిద్, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

మంగళగిరి: మానమ్మకం నీవే జగన్... జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం దేశంలోనే చారిత్రాత్మక కార్యక్రమం అని పార్టీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. నగర పరిధిలోని 15వ వార్డు 9వ సచివాలయం పరిధి బాప్టిస్టుపేటలో మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపరాణి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.
కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు కలకోటి బోయేజు పాల్గొన్నారు. నగరంలోని 27, 32వ వార్డులతో పాటు ఆయా వార్డుల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డు నాయకులు దేవళ్ల సుబ్బారావు, దేవళ్ల పద్మ, షంషాద్ బేగం పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో మా నమ్మకమే నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు పాల్గొన్నారు. రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో రూరల్ జేసీఎస్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాక, గుండిమెడ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ యువజన అధ్యక్షుడు మహేష్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బీసీ సెల్ నాయకులు బత్తుల దాసు పాల్గొన్నారు.

ప్రాపర్టీ డాక్యుమెంట్స్ పోయినవి

నేను దండా వెంకటరామిరెడ్డి, తండ్రి దండ సాంబిరెడ్డి, వయస్సు- 50 సం।।లు నిడమర్రు గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా - ఆంధ్రప్రదేశ్ కాపురస్తుడని నా ఒరిజినల్ ప్రాపర్టీ డాక్యుమెంట్స్ [Regd. No. 3/1972, date:- 17/01/1972] తీసుకొని జిరాక్స్ నిమిత్తం ఇంటినుండి మంగళగిరి వెళుతున్న దారి మధ్యలో ఎక్కడో పోయినవి. ఎంతవెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు సంప్రదించగలరు.

దండా వెంకటరామిరెడ్డి
నిడమర్రు గ్రామం, మంగళగిరి మండలం
గుంటూరు జిల్లా–522503
సెల్ : 9866340200